AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
15-7-2026 (Wednesday) MAIN EDITION

## అమల్లోకి భారత్ బ్రిటన్ ఫ్రీ ట్రేడ్ డీల్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్, బ్రిటన్ దేశాల మధ్య ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం భారత్ నుంచి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే 99 శాతానికి పైగా వస్తువులపై యూకే ప్రభుత్వం పూర్తి సుంకం రాయితీ కల్పించింది. దీనివల్ల వస్త్రాలు, చేనేత ఉత్పత్తులు, తోలు వస్తువులు, రత్నాలు, ఆభరణాలు , ప్యాక్డ్ ఫుడ్స్ వంటి భారతీయ ఉత్పత్తులు బ్రిటన్ మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తాయి. మరోవైపు బ్రిటన్ నుండి భారతదేశానికి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై పన్నులు సైతం తగ్గాయి.

## పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం



**అక్షరటుడే, ఏపీ :** అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నెహ్రూ ఫార్మాసిటీలోని సాయి చందన కంపెనీలో రియాక్టర్ పేలి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరవాడ ఫార్మాసిటీలో మూడు రోజులుగా నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఒక కంపెనీలో, మంగళవారం మరో కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. తాజాగా సాయిచందన కంపెనీలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కంపెనీలో 40 మంది కార్మికులు ఉన్నారు. అయితే అందరు సురక్షితంగా బయట పడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## రవీందర్‌కు 14 రోజుల రిమాండ్



**అక్షరటుడే, నాంపల్లి :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్ రవీందర్‌కు ఏసీబీ ప్రత్యేక కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన రవీందర్‌ను కోర్టులో హాజరుపరచగా, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ప్రతిపాదనలపై పరిశీలన



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** కేబీఆర్ పార్క్ పరిసరాల్లోవాహనాల సాఫీ రాకపోకల కోసం ప్రతిపాదించిన వన్‌వే మార్గ పనులను బుధవారం ఉదయం ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ట్రాఫిక్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

## ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీలేదు



**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం రాజీ పడదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మెడిసిన్లు అందేలా చూస్తామన్నారు. ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

# డీజిల్ బస్సులు తొలగిస్తాం



**హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని డీజిల్ బస్సులను తొలగించి వాటి స్థానంలో విద్యుత్ బస్సులు తెస్తామన్నారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. ఆటోలను సైతం విద్యుత్ వాహనాలు మార్చుకునేందుకు చర్యలు చేపడుతామని ప్రకటించారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

■ కాలుష్య రహితంగా హైదరాబాద్ ■ సీఎం రేవంత్‌రెడ్డి ■ ఫ్యూచర్‌సిటీలో డేటా సెంటర్‌కు శంకుస్థాపన

ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ డేటా సెంటర్ కోసం ప్రభుత్వం చందనపల్లిలో మరో 98 ఎకరాలను కేటాయించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు రెడ్డి తెలిపారు. 2034 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం చేరుకుంటామని వెల్లడించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నట్లు వివరించారు.

### అభివృద్ధి చెందిన రాష్ట్రంగా..

దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను నిలబెడుతామని సీఎం తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ మోడల్‌ను దేశానికే కాదు, ప్రపంచానికీ చూపించే దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో నివసించే నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. చైనాతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామన్నారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దీని కోసమే మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

### కీలక మైలురాయి

అమెజాన్ డేటా సెంటర్‌ను కీలక మైలురాయి ప్రాజెక్టుగా సీఎం అభివర్ణించారు. ఫ్యూచర్ సిటీకి ఇది ప్రధాన బలంగా మారి, ప్రపంచ స్థాయి కంపెనీలు, సరఫరా గొలుసులు, అనుబంధ పరిశ్రమలను ఆకర్షించి తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ , ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధిని కల్పించడానికి ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్‌లు, భూ కేటాయింపులు, పెట్టుబడిదారుల ప్రోత్సాహకాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు.

## ఇరాన్‌పై అమెరికా దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. ఇరాన్ నౌకా రవాణాపై దిగ్బంధనాన్ని పునరుద్ధరిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా సైన్యం ఇరాన్‌పై వరుసగా మూడో రాత్రి కూడా దాడులు చేసింది. ఇరాన్‌పై ఏడు గంటల పాటు దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు దాడులు కొనసాగాయని పేర్కొంది. ముఖ్యంగా హర్మూజ్‌లో నౌకలపై ఇరాన్ దాడులు చేపడుతుండటంతో అమెరికా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీర ప్రాంతాల సమీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేసింది.

## వైశాలినగర్ అండర్ పాస్ మూసివేత




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** సైబరాబాద్ పరిధిలోని వైశాలి నగర్ రైల్వే అండర్‌పాస్ వద్ద రోడ్డు విస్తరణ, వర్షపు నీటి కాలువ పనులు చేపట్టనున్నారు. దీంతో జూలై 16 నుంచి 20 రోజుల పాటు ఆ మార్గం పూర్తిగా మూసివేయబడుతుందని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ ప్రకటించారు. వైశాలి నగర్ అండర్‌పాస్ ఇరుకుగా ఉంది. భారీ వర్షాల సమయంలో తరచుగా నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిని విస్తరించడంతో పాటు సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో 20 రోజుల పాటు అండర్‌పాస్ మూసి వేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం: హరీష్ రావు



**అక్షరటుడే, సిద్దిపేట :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణ వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వం వైఖరికి నిరసనగా వేముల దీక్ష చేపట్టాలని భావించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టేవారిని కూడా నిర్బంధించడం దారుణమని, ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనకు నిదర్శనమని హరీష్‌రావు మండిపడ్డారు. హిట్లర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు.

## తిరుమలలో ఆక్టోపస్ కమాండోల మాక్ డ్రిల్

**అక్షరటుడే, తిరుపతి :** తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తుల రక్షణే ధ్యేయంగా భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ఎటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా నిమిషాల్లో స్పందించేలా, అత్యున్నత ప్రమాణాలతో కూడిన మాక్ డ్రిల్‌ను అధికారులు నిర్వహించారు. పీఏసీ 4 సత్రంలో ఉగ్రవాదులు చొరబడినట్లుగా ఊహించి చేపట్టిన ఈ కసరత్తు, తిరుమలలో భద్రతా వలయం ఎంత పటిష్టంగా ఉందో కళ్లకు కట్టినట్లు చూపింది. ఆక్టోపస్ కమాండోలు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ఈ ఆపరేషన్, భక్తులకు భద్రతపై మరింత భరోసా కల్పించింది.



## అద్దె వాహనాల యజమానుల నిరసన



**అక్షరటుడే, హైదరాబాద్ :** తమ బకాయిలు చెల్లించాలని సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద అద్దె వాహనాల యజమానులు బుధవారం నిరసన తెలిపారు. రూ.170 కోట్ల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాధికారులకు అద్దె ప్రాతిపదికన వాహనాలు నడుపుతున్న యజమానులు నేటి నుంచి సమ్మెకు దిగారు. ప్రభుత్వం 18 నెలలుగా బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెతో రాష్ట్ర వ్యాప్తంగా 5 వేలకు పైగా అద్దె వాహనాలు నిలిచిపోయాయి.

## మాదాపూర్‌లో యువకుడి దారుణ హత్య



**అక్షరటుడే, మాదాపూర్ :** హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌లో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వరంగల్ జిల్లా మాదన్నపేట్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌గా మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో కుక్‌గా పని చేస్తున్నాడు. అతడు ఉప్పరపల్లికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. అమ్మాయి తల్లిదండ్రులు వేరే యువకుడితో ఆమెకు వివాహం జరిపించారు. పెళ్లి తర్వాత ఆ అమ్మాయికి భర్తతో గొడవలు అయ్యాయి. దీంతో ఆమెకు భర్త విడాకులు ఇచ్చాడు. విడాకులకు తన కుమార్తెను ప్రేమించిన భాస్కర్ కారణమని ఆమె తండ్రి రాజు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మరికొందరితో కలిసి భాస్కర్‌ను హత్య చేశాడు.

## రాష్ట్రాన్ని నడిపిస్తున్న చంద్రబాబు సిండికేట్ : వైఎస్ జగన్



**అక్షరటుడే, ఏపీ:** వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఆరోపించారు. భీమవరం ఆక్వా రైతుల సభలో జగన్ మాట్లాడారు. ఆక్వా రైతులకు సప్లయ్ చేసే సీడు, ఫీడు, పంట కొనుగోలు మొత్తం ప్రక్రియ చంద్రబాబు సిండికేట్ నడిపిస్తోందని జగన్ ఆరోపించారు. సీడు, ఫీడు రేట్లు నిర్ణయించేది వాళ్లే అన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన రొయ్యలు, చేపల ధరలను సిండికేట్ పడేస్తోందన్నారు.

## రష్యా చమురుపై 100 శాతం సుంకం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రష్యా ఆర్థిక వ్యవస్థను, ఇంధన ప్రాజెక్టులను దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా కాంగ్రెస్ ఒక ప్రత్యేక బిల్లును రూపొందిస్తోంది. ఇందులో భాగంగా, గతంలో ప్రతిపాదించిన 500 శాతం సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గిస్తూ బిల్లులో కీలక మార్పులు చేశారు. రష్యా నుంచి ముడిచమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ వంటి దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆంక్షలను సిద్ధం చేస్తున్నారు. ఈ సవరించిన బిల్లుకు అమెరికాలోని అధికార డెమొక్రాట్లు, ప్రతిపక్ష రిపబ్లికన్ల నుంచి పూర్తి మద్దతు లభించడం విశేషం. రష్యా నుంచి రాయితీ ధరలకు ముడిచమురును పొందుతూ తమ దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకుంటున్న భారత్ వంటి దేశాలపై ఈ 100 శాతం సుంకాల ప్రభావం ఎలా ఉంటుందనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.